క్లుప్తంగా

పట్టణాభివృద్ధికి సహకరించాలి

- మున్సిపల్ ఆర్ఐ నారాయణరావు



యూజర్ చార్జీలను వసూలు చేస్తున్న మున్సిపల్ ఆర్ఐ

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా యూజర్ చార్జీలు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు కోరారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో వన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్‌చార్జీలు చెల్లించడం ద్వారా పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక వైద్యశాఖ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంగళవారం ఆందోళన చేశారు. పని భారం తగ్గించాలని, ప్రభుత్వ సెలవులను మంజూరుచేయాలని, రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్సు కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

400పశువులకు టీకాలు



తుమరాడలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

బలిజిపేట: మండలంలోని తుమరాడ గ్రామంలో 400పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ మేరకు మండల పశువైద్యశాఖ అధికారి గణేష్ తెలిపారు. పశువులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు సోకే అవకాశాలు ఉన్నందున ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేర చేపట్టినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ



శిక్షణ పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: పనిలో నైపుణ్యం మెరుగుపరచడానికి జిల్లాలో గల ల్యాబ్‌టెక్నీషియన్లకు శిక్షణ అందజేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో ల్యాబ్‌టెక్నీషియన్లకు అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు ఖర్చులేకుండా ల్యాబొరేటరీ పరీక్షలు చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. అందుకుగాను జిల్లాలో గల 37 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌సీల టెక్నీషియన్లకు పదిరోజులపాటు ఏడు బ్యాచ్‌లకు శిక్షణ అందజేస్తున్నామని తెలిపారు. జిల్లా ఆస్పత్రి పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం సీహెచ్‌సీలలో సీనియర్ టెక్నీషియన్ల వద్ద హ్యాండ్స్ ఆన్ శిక్షణ అందజేస్తున్నామన్నారు.

గడపగడపకూ పథకం పనులు పూర్తి చేయాలి

సీతానగరం: ప్రభుత్వం చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించిన సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అప్పట్లోనే పరిష్కరించేందుకు సాంకేతిక పరమైన అనుమతులు ఇచ్చామన్నారు. ప్రారంభించిన పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే నిర్వాహకులు పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిధుల కొరతలేదని పనులు పూర్తి చేసిన తరువాత ఇంజినీరింగ్ అధికారులు రికార్డింగ్ చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గాదెలవలస ఇంజినీరింగ్ సహాయకుడు జగన్మోహన్‌రావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఆస్తిపన్నుతో కలిపి చెత్తపన్ను

- ఆరునెలల కోసారి చెల్లించాలి
- మున్సిపాలిటీలకు పురపాలక శాఖ ఆదేశాలు

పార్వతీపురం టౌన్:

మున్సిపాలిటీల్లో ప్రతి నెలా విధించే చెత్తపన్ను (యూజర్ చార్జి) ఇక నుంచి ఆరు నెలల కోసారి ఆస్తి పన్నుతో కలిపి చెల్లించేలా రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. ఇంత కాలం చెత్త పన్నును పారిశుద్ధ్య విభాగానికి చెందిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లే వసూలు చేసేవారు. తాజా ఆదేశాలతో ఇక నుంచి రెవెన్యూ విభాగంలోని ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు వసూలు చేస్తారు. దీంతో జిల్లాలోని పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు, పాలకొండ నగరపంచాయతీ కమిషనర్లు చెత్త పన్ను వసూలు బాధ్యతలను పారిశుద్ధ్య విభాగం నుంచి రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. పట్టణాల పరిశుభ్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ క్లాప్ ద్వారా మున్సిపాలిటీలకు గార్బేజ్ టిప్పర్లను సమకూర్చింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర పురపాలక శాఖ క్లాప్‌ను నిర్వహిస్తోంది. ఇంటింటికీ వెళ్లి మూడు రకాలుగా చెత్తను గార్బేజ్ టిప్పర్ల ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది సేకరిస్తున్నారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను సేకరించి తడి చెత్తను ప్రత్యేక శుద్ధీకరణ ప్లాంట్ల ద్వారా తిరిగి ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే మున్సిపాలిటీల్లో చెత్త శుద్ధీకరణ ప్లాంట్ నిర్మాణాలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రతి నెలా పట్టణ ప్రజలు, వ్యాపారుల నుంచి చెత్త పన్ను వసూలు చేసి రాష్ట్ర పురపాలక శాఖకు ఆయా మున్సిపాలిటీలు కొంత మొత్తాన్ని చెల్లించాలి. దీని కోసం ఒక్కో మున్సిపాలిటీకి చెత్త సేకరణ సామర్థ్యం, భవనాల సంఖ్య ఆధారంగా మొత్తాలను నిర్దేశించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఆదేశాల మేరకు ప్రతి మున్సిపాలిటీ విధిగా చెత్త పన్ను వసూలు చేయాల్సిందే.



పట్టణానికి కేటాయించిన క్లాప్ వాహనాలు

నిర్దేశించిన మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాలి

పంజాబ్, పశ్చిమబెంగాల్, ఛండీగఢ్, తెలంగాణ రాష్ట్రాలు చెత్త పన్నుల వసూలు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఎన్జీటీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు భారీ జరిమానా విధించింది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం కూడా చెత్త పన్ను వసూలును అనివార్యం చేస్తూ ఆ బాధ్యతలను తాజాగా రెవెన్యూ విభాగానికి బదలాయించింది. ఇంటికి రూ.50, వ్యాపార దుకాణానికి రూ.120 అక్కడి నుంచి రూ.500 నుంచి రూ.2 వేల వరకూ ఆయా భవనాల స్థాయి, కేటగిరీలను బట్టి చెత్త పన్ను విధిస్తారు. ఈ పన్ను వసూలు చేయడం పారిశుద్ధ్య విభాగానికి అదనపు విధులుగా ఉంటోంది. పారిశుద్ధ్య విభాగం సిబ్బంది చెత్త పన్ను వసూలుకు వెళ్తుంటే కొందరు చెల్లిస్తున్నారు. మరికొందరు చెల్లించడం లేదు. అదే రెవెన్యూ విభాగం సిబ్బంది అయితే ఆస్తి పన్నుతో పాటు వసూలు చేసే పరిస్థితి ఉంటుంది. దీనికితోడు పారిశుద్ధ్య విభాగాన్ని ఇక నుంచి పూర్తిగా చెత్త సేకరించే పనిలోనే నిమగ్నమయ్యేలా చేస్తోంది. ఓ ఇంటి యాజమాని నెలకు చెత్త పన్ను రూ.50 చెల్లించేవారు. ఇక నుంచి అదే ఇంటి యాజమాని ఆరు నెలలకోసారి ఆస్తి, కుళాయి చెల్లించే సమయంలోనే ఆ పన్నులతో పాటు చెత్త పన్ను రూ.300 చెల్లించాలి.

కచ్చితంగా చెల్లించాలనే స్పష్టత ఇస్తుంది...



మున్సిపాలిటీల్లో చెత్త పన్నును రెవెన్యూ విభాగాలు వసూలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ బదిలీతో పన్ను చెల్లింపుదారులకు ఓ బాధ్యతను గుర్తు చేయడమే కాకుండా కచ్చితంగా చెల్లించాలనే స్పష్టత వస్తుంది. చెత్త పన్ను వసూలు చేసిన తర్వాత అది పూర్తిగా మున్సిపాలిటీ ఆదాయంలో జమ కాదు. అధిక శాతం నిధులు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కే చెల్లించాలి.

– రామప్పల నాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

విద్యార్థికి ఎమ్మెల్యే అభినందన



సాయికృష్ణ మోహన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: మండలంలోని పెద్దబొండపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి సాయికృష్ణ మోహన్ గేట్‌లో జాతీయస్థాయి 35వ ర్యాంకు సాధించడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ విద్యార్థిని మంగళవారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడి తల్లిదండ్రులు, పార్వతీపురం ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థి తండ్రి గుంట్రెడ్డి దామోదరరావు, మజ్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఏఈ శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని సచివాలయ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలని పీఆర్ ఏఈ శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం అంటిపేటలో జరుగుతున్న సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటిపేట సచివాలయ భవనం నిర్మాణం లోతట్టు ప్రాంతంలో చేపట్టడం వల్ల కొంతమేర ఆలస్యమైందన్నారు. మిగతా సచివాలయ భవన నిర్మాణాలు పూర్తి కావస్తుండడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. గాదెలవలస,పెదభోగిలి, కాశీపేట, నిడగల్లు, వెంకటాపురం, పెదంకలాం గ్రామాల్లో భవనాలను ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరికి మహేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.నిర్మల, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో ప్రపంచ సిండ్రోమ్ దినోత్సవం



భవిత విద్యార్థికి కేక్ తినిపిస్తున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా సీతానగరంలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారిణి సూరిదేముడు అధ్యక్షతన మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డౌన్ సిండ్రోమ్ పిల్లలతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బాసటగా నిలవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. భవిత విద్యాలయంలో దివ్యాంగులైన పిల్లలకు ప్రభుత్వం అనేక పథకాలు, సౌకర్యాలు ఉచితంగా విద్యాబోధన పరికరాలు, రవాణా భత్యం, ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ చికిత్స, ఉచిత ఉపకరణాలు పంపిణీ చేస్తోందని తెలిపారు. పిల్లలతల్లిదండ్రులు వారి పిల్లల్ని భవిత విద్యాలయానికి పంపించి ప్రభుత్వం కల్పిస్తున్న సేవలన్నీ వినియోగించుకోవాలని కోరారు, కార్యక్రమంలో సహిత విద్యా ఉపాధ్యాయులు కృష్ణ మోహనరావు, ఫిజియోథెరపీ డాక్టర్ అజయ్ కుమార్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌లు, ఆఫీస్ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌సీ, డేకేర్ సెంటర్ల పరిశీలన

పార్వతీపురంటౌన్:

జిల్లా ఆస్పత్రిలో ఎన్ఆర్‌సీ, తలసేమియా డేకేర్ సెంటర్లను జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్‌మోహన్‌రావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఆర్‌సీ కేంద్రంలో చిన్నారులకు రోజువారీ ఇస్తున్న పౌష్టికాహార మెనూ, మందులు, బరువు రికార్డులను పరిశీలించినట్లు చెప్పారు. పిల్లల ఆరోగ్యస్థితిని పరీక్షించి తల్లులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగితెలుసుకున్నామన్నారు. వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లల్లో బరువు తక్కువగా, పౌష్టికాహారలోపం ఉన్న పిల్లలు, తరచూ అనారోగ్యానికి గురవుతున్న పిల్లలను గుర్తిస్తే వెంటనే సిబ్బంది వారిని ఎన్ఆర్‌సీ కేంద్రాలకు రిఫర్ చేయాలని కోరారు. ప్రతి రెండు నుంచి మూడు గంటలకొకసారి ఎన్ఆర్‌సీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నారన్నారు. అనంతరం తలసేమియా, డేకేర్ సెంటర్లను సందర్శించి అక్కడ వైద్యసేవలు పొందుతున్నవారిని పరిశీలించారు. ప్రతి నెల ఆరోగ్యపర్యవేక్షణకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉండేలా చూడాలని సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగూడ న్యూట్రిషన్ జ్యోతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



ఎన్ఆర్‌సీసెంటర్‌లో మందులను పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహన్‌రావు

అంతర్గత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పురపాలకసంఘం పరిధిలో పలు రహదారులను ఆధునీకరించేందుకు పూర్తి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ పరిశీలనలో భాగంగా జిల్లా ఆస్పత్రి ప్రధాన రహదారి, మైదానం వీధి రహదారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారి, జనశక్తి కాలనీ వరకు అంతర్గత సీసీ రోడ్లు ఆధునీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల క్రితం వేసిన రహదారులు లోతట్టుగా మారి అక్కడక్కడ పాడై వర్షపునీరు, వాడుకనీరు రోడ్డుపై నిల్చి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా లేవన్నారు. ఆయా రహదారులను పునర్నిర్మించాలని అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అందజేయాలని సంబంధిత అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ జేమ్స్, డీఈఏ అప్పాజీ, ఏఈ రాజేంద్రకుమార్, బి.ప్రమీల, పీఆర్‌డీఈ రత్నాకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మండల అధ్యక్షుడు బొంగు రాజు, నాయకులు బోను ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రహదారి సమస్యకు పరిష్కారం

కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న పట్టణంలోని 17వ వార్డు ఖంగారమ్మ కాలనీ ప్రజల ఆశ నెరవేరింది. కాలనీలో ఉపయోగించే రహదారిని సీసీరోడ్డుగా మార్చాలని వారు కోరుకున్నారు. దీని కోసం దశాబ్దాలుగా వేచిచూస్తుండగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవతో వారి సమస్యకు మంగళవారం తెరపడింది. ఈ రోడ్డు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన అనతికాలంలోనే ఆయన దృష్టిసారించి సమస్యను పరిష్కరించారు. ఈ మేరకు ప్రారంభించిన రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించడానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు కృతజ్ఞత తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు

పార్వతీపురంటౌన్: స్త్రీనిధి రుణాల రికవరీ శత శాతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 15మండలాల వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు అందిస్తున్న స్త్రీనిధి రుణాలను ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించేలా సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. రుణాలు సక్రమంగా చెల్లించేలా సభ్యులకు తెలియజేయాలని, మార్చి 31 నాటికి రికవరీ 100శాతం ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వన్‌ధన్ వికాస్‌కేంద్రాల ద్వారా గిరిజన ఉత్పత్తులను మహిళా సంఘాల ద్వారా మార్కెటింగ్ చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పండించిన పంటలను నేరుగా వన్‌ధన్ వికాస్ కేంద్రాలకు వచ్చేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పీజీఎం ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాలు పరిశీలించిన జమ్మాన

బలిజిపేట: ఇటీవల కురిసినచ వర్షాల ప్రభావానికి పి.చాకరాపల్లిలో వాటిల్లిన పంటనష్టాన్ని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మంగళవారం పరిశీలించారు. 25ఎకరాల్లో పంట నష్టం జరిగిందని రైతులు ఆయనకు ఈ సందర్భంగా తెలిపారు. నష్టాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని జమ్మాన వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహనరావు, కె.గౌరి, టి.గోవింద్, రైతులు పాల్గొన్నారు.



చాకరాపల్లిలో పంట నష్టాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పాఠశాల విద్యార్థులకు
రాగి జావ పంపిణీ

సీతానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నాణ్యమైన,పోషక విలువలతో కూడిన రాగి జావ సేవించాలని జెడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఉన్నతపాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం గోపాలనాయుడు ఆధ్వర్యంలో జగనన్న గోరుముద్ద అమలులో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంఈఓ జి సూరిదేముడు మాట్లాడుతూ మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 3,177 మంది విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఎంపీటీసీ1, ఎంపీటీసీ 2, స్టాఫ్ సెక్రటరీ తవిటినాయుడు, ఉపాధ్యాయులు,సీఆర్‌పీలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు. పెదంకలాంలో ఎంపీపీ బి.రమణమ్మ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. అలాగే కేఎస్‌పురం యూపీ స్కూల్, ఇప్పలవలస, లచ్చయ్యపేట, నిడగల్లు ఎంపీఈపీ పాఠశాలల్లో రాగి జావను పంపిణీ చేశారు.

బలిజిపేటలో..

బలిజిపేట: పాఠశాల విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాలల వద్ద స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. అందులో భాగంగా పెదపెంకి ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ నాగమణి, చిలకలపల్లి ఉన్నత పాఠశాల వద్ద జెడ్పీటీసీ రవికుమార్‌లు విద్యార్థులకు రాగిజావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి పెద్దపీట

పాచిపెంట: విద్యార్థుల చదువులతో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగా జగనన్న గోరుముద్ద పథకంలో అధిక పోషకవిలువలు కలిగిన రాగిజావను చేర్చిందని జెడ్పీ వైస్ చైర్మన్ కొరజన్ని సింహాచలం, ఎంపీపీ బద్నాన ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగిజావను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు 'జగనన్న గోరుముద్ద' పథకం కింద పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మీసాల నారాయణ, ఎంపీటీసీ దండి ఏడుకొండలు, హెచ్‌ఎం ఆర్.పెంటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతానగరం: స్థానిక ఉన్నత పాఠశాలలో రాగి జావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ

సాలూరులో...

సాలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. మండలంలోని రామస్వామివాలస పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగిజావను పంపిణీ చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు, 3రోజులు చిక్కీలు అందిస్తుండగా.. ఇకపై వీటికి అదనంగా వారంలో మూడు రోజులు రాగిజావ అందిస్తారన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి

మక్కువలో..

మక్కువ: విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగా 'జగనన్న గోరుముద్ద' పథకం కింద సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు మువ్వడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్.ఎన్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రాగిజావను పంపిణీ చేశారు. రాగిజావ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. బంగారువలస పాఠశాలలో సర్పంచ్ శంబంగి హరికృష్ణ విద్యార్థులకు రాగిజావ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, ఎంపీడీఓ దేవకుమార్, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఏపీఎం సన్నిబాబు పాల్గొన్నారు.



పాచిపెంట: విద్యార్థులకు రాగిమాల్ట్ అందిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ కె.సింహాచలం, ఎంపీపీ బి.ప్రమీల



మక్కువ: మక్కువ పాఠశాలలో రాగిజావ రుచిచూస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు, రంగునాయుడు



సాలూరు: రాగిజావ తాగుతున్న విద్యార్థులతో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్